**సి.పి.బ్రౌన్ అకాడమీ - నవ్యవీక్లి ఉగాది కథలపోటీలో**

**తృతీయ బహుమతి రూ. 5,000 పొందిన కథ**

శివాలయం పక్కనే ఉండే ఇసికలో ఆడుకుంటాంటే అప్పుడే మా సావాసగాడు సోమయ్యగాడు వచ్చినాడు. వాడు నేను ఇసికలో కాసేపు కలబడితిమి. కాసేపు దొమ్మరగంతలు కొట్టి, ఇసికలో ఆడుకుంటాన్నె గొల్లీది పిల్లోల్లు కూరంగాడు, వాల్లన్న శింగరయ్య, ఇంగిద్దరు కుమ్మరోళ్ళ పిల్లోళ్ళు అందరం కలిసి కాసేపు కబడి ఆడ్తిమి. ఆటయిపోయినంక ఎవరిదావన వాళ్ళు పాయిరి. సోమయ్య గాడు గూడా ఎల్లబారినాడు. నేను ఒక్కన్నే ఇసికలో గూకోని అడుగునుండి ఇసిక తీచ్చి. ఆ ఇసిక ఒక్కరవ్వ తడిగా ఉంటది. కుడికాలు ముందుకు పెట్టి పాదం మీద ఆ ఇసికనుపోసి పిట్టగూడు కడ్తాంటి. కాలు మునిగేతట్టు ఇసికపోసి మెల్లగా దాన్ని రెండు శేతులతో తట్టి పాదం వాటంగా బయటకు లాగాల ఏ మాత్రం కదిలినా గూడా అది కూలిపోతది. సాలినంత ఇసికపోసి రెండు శేతులతో బాగా తట్టి కాలు మెల్లంగా బయటకు లాగుతుంటే... ఎనకనుండి ఎవరో వచ్చి ఈపులమీద గట్టిగా తగిలేసరికి కాలు కదిలి గూడు కూలి పోయింది. ఎవురబ్బా అట్ట తగిలిరి సోమయ్యగాడేమో అని ఎనిక్కితిరిగి సూచ్చి, నా ఎనక ఒకాయమ్మి కిందబడి లేచ్చావుంది. ఎవురీయమ్మి అని అనుకుంటాండగానే ఆయమ్మి నా తట్టుకూడా సూడకుండా... పక్కనే నిలబడు కోనున్నె ఇక పిల్లోన్ని 'నిలబడు నా బట్ట నీ కథ చెప్త' అని ఆ పిల్లోన్ని ఎంటపన్నేది. నాకు బో కోపమొచ్చింది. తిడదామంటే ఆయమ్మి ఏంటోల్లా యమ్మో తెలియదు. ఆడపిల్ల అందునా కాపోల్ల పిల్లయితే పెద్ద గలాటయితది. అయ్యగారి పిల్లోల్లతో ఆడుకున్నా తిట్లే ఆడుకోకున్నా తిట్లే అన్నెట్టు... ఇట్లా అనుకుంటాంటేనే ఆయమ్మి ఆ పిల్లోన్ని ఎంటబడి పట్టుకోని ఒంగపెట్టి దబాదబా రెండు మూడు గుద్దులు గుద్దింది. వాడు పచ్చిగా తిడతా, అని ఏడుచ్చా శించుకోని ఉరికినాడు. ఆన్నెఉంటే ఇంగా కొడ్తదని.

# ఆయమ్మి

## బత్తుల ప్రసాద్

వాడట్ట పోతానే ఆయమ్మి నాతట్టు వచ్చింది. ఆయమ్మి కండ్లలో ఒక్కరవ్వ భయం కనపడతాంది.

ఆయమ్మి భయం భయంగా 'నేను నడుచ్చా ఉంటే ఆయబ్బీ నీ మీనికి తోసినాడు' అనింది. నేను ఆయమ్మి తిట్టే సూచ్చాండ ఇంతకు ఎవురీయమ్మి మనూర్లో ఎప్పుడూ సూళ్ళేదు. ఊర్లో ఉండే శానమంది ఆడపిళ్లోల్లను అందరినీ గుర్తుపడతాను. శానామందిని వాళ్ళమ్మనాయనా మొక్కట్లు బట్టి కనుక్కోవచ్చు అని ఇట్ట ఆలోసిచ్చాండగానే ఆయమ్మి ఇసికలో గూకోని తడి ఇసిక తవ్వి గబగబా గూడు కట్టింది.

'నీ గూడు పడగట్టినందుకు నా గూడు తీసుకో' అన్నెది. 'ఏం పేరు' అని అడిగినాను. ఆయమ్మి కండ్లలో భయం పాయినట్టుండాది. 'సుబ్బలచ్చిమి' అన్నెది ఒక్కరవ్వ నవ్వు మొకంపెట్టి.

'నీ పేరేంది' అన్నెది. నా పేరు శెప్పినాను. నా పేరు ఇని ఆయమ్మి నవ్వినాది. 'మీరాడుంటారు' అని అడిగినాను. 'అద్దో ఆ సత్రంలో' అని శివాలయం కాడుండే సత్రం దిట్టు సూపినాది.

శివాలయం కాడుండే సత్రంలో సాధులు, హరికథలు, బుర్రకథలు చెప్పడానికి వచ్చినవాళ్ళు పగటేశగాళ్ళు, సాపలు, ఈత పొరక్కట్లు తయారుజేసుకుంటా ఊరురా తిరుగుతా ఉండే జాతుల వాళ్ళు ఇట్టాటోళ్ళంతా ఆ సత్రంలో దిగి వాళ్ళ పని అయిపోయినంక మళ్ళా ఇంగోకూరికి ఎల్లబారి పోతాంటారు. ఎవ్వరూ లేనప్పుడు ఊర్లో ఉండే పోరంబోకు నాయాళ్ళంతా వచ్చి అక్కడ మంగతాయి, శెక్కాబొమ్మా ఆడతాంటారు.

అప్పుడు ఆయమ్మిని గమనిచ్చి. అప్పుడప్పుడే వయసులోకి వచ్చినట్టుండాది. పెద్ద పెద్ద కండ్లు, తలకాయకు ఆందెం పెట్టి దువ్వినట్టుండాది. టెంకాయ మాదిరింది తలకాయ. ఆయమ్మి మొకంలో ఏదో ఆకర్షణ ఉంది. ఏసుకున్న గుడ్డలు పాతయి అక్కడక్కడా శినిగిపోయి ఉండాయి. అయినా ఆయమ్మి బాగుంది. ఆయమ్మిని సూడగానే మాట్లాడాలనిపిచ్చది. ఆయమ్మి ఎవురి పిల్లో వాళ్ళు ఏమి జేచ్చరో తెల్సుకుందామనుకుంటి. లేసి మిందపన్నె ఇసికను ఇదిలిచ్చికోని ఇంటిదావ బడ్తి. ఆయమ్మి కంపపుల్లలు ఏరుకోవడానికి కంపశెట్ల తిట్టుపోయినాది.

సత్రం ముందరినుండే ఇంటికి పోవాల. ఇంటికి

పోతా పోతా సత్రం తిట్టు జూచ్చి. ఈతసాపలు ఒక పక్క, పొరకలు ఒకపక్క ఉండాయి. కావళ్ళు, పాతగుడ్డల మూటెలు, బోకులు బొచ్చలు ఉండాయి. నలుగురు అయిదుగురు మొగోళ్ళు ఆడోళ్ళు ఉండారు. ఎవరిపని వాళ్ళు జేసుకుంటా ఉండారు. ఒకామె సత్రం బయట పొయ్యిమీద కుండబెట్టి ఏందో వండుతాంది. పొయ్యిమండ కుండా ఉంటే ఊదురగొట్టం పెట్టి ఊదుతాంది. వాళ్ళను జూసి వాళ్ళు ఊరూరా తిరిగే జాతుల వాళ్ళు అనుకుంటి.


కాలేజీకి సెలవులు గాడంతో పగలంతా ఏం పని లేదు. పొద్దన్నే లేసి ఇంత తిని ఎర్రలు తవ్వుకోని గాలాలు శేతపట్టుకోని సగిలేట్లోకి పోతి. ఏట్లో సుద్ద బాయి దిక్కు నడుచ్చాపోతాంటే సాకలోళ్ళు గుడ్డలు తికే కాడ ఇద్దరు ముగ్గురు పిల్లోళ్లు గుడ్డలుతుక్కుంటాండిరి. దగ్గరికి పోయినంక తెలిసింది. నిన్నకనపన్నాయమ్మి వాళ్ళ శెల్లెలు, నిన్న వాళ్ళక్కతో గుద్దిచ్చుకున్న తమ్ముడు. మనుసులకు కనిపించకుండా కంపశెట్లలో మాంచి మదుగు ఉంది. ఎప్పుడూ ఆడికే పోయి గాలాలు ఏచ్చాంట. ఆడికి పోవాలంటే ఈ సాకలోళ్ళు గుడ్డలుతికే బండలకాన్నుండే పోవాలి. బండలకాడికి వచ్చి. ఆయమ్మి గుడ్డలుతుకుతా నన్ను జూసి సావాసంగా నవ్వినాది. నాగ్గూడా నవ్వు వచ్చినాది. ఎన్నేండ్ల నుండో పరిచయం ఉన్నెట్టు నవ్వుకుంటిమి.

నిలబడకుండా ఆ మదుగుకాడికి పొయి రెండు గాలాలు ఇప్పి ఒకదానికి ఎర్ర ఎక్కిచ్చి ఎర్రమీద తుపుక్తుపుక్ అని ఊసి నీళ్ళల్లో ఏచ్చి. దాన్ని గమనిచ్చానే ఇంగో గాలం తీసుకోని దానికి ఎర్ర ఎక్కిచ్చి దాన్ని ఎడం పక్క ఏసి సక్కలబెల్లం ఏస్కోని కూకుంటి. కాసేపు ఎడంపక్క గాలం బెండు కదుల్తాంటే దాని సువ్వను ఎత్తి పట్టుకుంటి. బెండు రెండు మూడుసార్లు ముటికిచ్చి గబక్కిని లోపలికి గుంజకపాయ. ఎప్పుడు బెండు మునుగుతదా కొడదామా అనుకుని రెడీగా ఉండి సత్తవకొద్దీ గుంజితి. పటపటమంటా బయట వచ్చి పడింది మాంచి జెల్ల. గాలాన్ని కడుపులోకి మింగినాది. వయరుకే ఏలాడబడుంది. శాపను శేతిలోకి తీసుకుంటి. అది కిసకిస అని అరుచ్చాంది. జెల్లకు ఉండే ముళ్ళు కుచ్చుకోకుండా వాటంగా పట్టుకోని గాలాన్ని బయటికిలాగి శాపను అట్టదూరంగా గడ్డిలోకి ఇసిరేసి మళ్ళా గాలానికి ఎర్ర ఎక్కిచ్చి నీళ్ళలో ఏసి శేతులకున్నె జోము తుడ్సుకుంటా ఉంటే కుడిపక్క గాలం బెండు మెల్లగా ముటికిచ్చాంది. దాని సువ్వను గూడా రెడీగా ఎత్తిపట్టుకుంటి. బెండు ముందుపక్క ఒక్కరవ్వ మునుగుతావుంది. అంటే మిషను కుట్టినట్టు టకటకకొడతా ఉంది. అట్ట కొట్టేది కుంటపాము లేకుంటే పాపర అయింటది అనుకుంటి. అట్టఅట్టకొడతా మెల్లంగా బెండు తలకాయ సగం ముంచి పెట్టింది. ఇంగ కొడితే యాడికి పోదు అని మెల్లగ గాలం సువ్వ పట్టుకోని సతవ కొద్దీ గుంజితే మాంచి పాపర పటపటమంటా వచ్చి గడ్డిలో పడి పాము మెలికలు తిరిగినట్లు తిరుగుతాంది. దాని ఈపుకు గూడా ముళ్ళులు ఉంటాయి. దాన్నిగూడా శానా వాటంగా పట్టుకోవాలి. అదిగూడా గాలాన్నిబాగా మింగింది. శాపను కదలకుండా కాలికింద తొక్కిపెట్టి



గాలం బయటికి పీకితి.

ఏటి గడ్డన ఉండే తుంగను ఒకదాన్ని పీకి దాని మొదులు నమిలి ముడిగట్టి ముందు పడిన జెల్లను ఎక్కిచ్చి. మళ్లా పాపర్ను ఎక్కిచ్చి, మల్లా గాలానికి ఎఱ్ర ఎక్కిచ్చి నీళ్ళలో ఏచ్చి. ఒకటయితానే ఒకటి గాలానికి శాపలు పడ్తాండయి. ఆ శాపల్ను తుంగకు ఎక్కిచ్చే టైముగూడా లేదు. ఈ రెండు గాలాల్ను కాసుకోడమే సరిపోయింది. ఇట్ట నేను శాపలు పడ్తా ఉంటే ఆయమ్మి వచ్చి ఎనక నిలబడుకున్నెది. నేను లేసి యాడాడ పన్నె శాపలన్ని తెచ్చి ఒకసాట ఏచ్చాఉంటే ఆయమ్మి గూడా వచ్చి ఏరిచ్చింది. శాపలు తుంగకు ఎక్కిచ్చాంటే రెండు గాలాల బెండ్లు కదులుతాంటె మద్దెలో ఇడ్సి పెట్టిపోతి. రెండు గాలాలకు రెండు శాపలు పన్నాయి. నేను ఇడ్సిపెట్టి పోయిన శాపల్ను ఆయమ్మి తుంగకు ఎక్కిచ్చాంది. నేను ఆతట్టు సూచ్చే ఆయమ్మి శెప్పకుండా అట్టెందుకు సేచ్చాండవు అంటానేమోనని బయంగా నాతట్టు జూసింది. నేను మెచ్చుకున్నెట్టు జూసే తలికి ఆయమ్మికి ఇంగొక్కరవ్వ ధైర్యం వచ్చినట్టుండాది. అప్పుడు పన్నె శాపల్ను కూడా ఏరకపోయి తుంగకు ఎక్కిచ్చింది. సుతారుగ గబ గబ కేజి శాపలు పన్నెయి. కాసేపు ఈదరగాలి కొట్టింది. దాంతో నీళ్ళల్లో తొనుకులు వచ్చి బెండ్లు ఎగురుతాండయి.



ఒక్కరవ్వ కాలీ దొరకడంతో ఆయమ్మి తిట్టు జూసి నవ్వితి ఆయమ్మి కూడా నాతిట్టు జూసి నవ్వినాది.

'బడికిపోవా' అనడిగితి. 'మాకు బడి ఏన్నుండి వచ్చది ఒకూర్లైతే సదువుకునే దానికి అయితది ఊర్లం బడి తిరుగుతాంటం మాకు సదువు బడి ఏంటికి' అన్నెది.

'మీ సొంతూరు ఏ ఊరు?' అనడిగితి.

'ఏ ఊరో తెలియదు ఏ ఊర్లో ఉంటే అదే సొంతూరు' అనింది.

'మీ యమ్మా నాయన ఏమి శేచ్చాంటరు' అనడిగితి. 'మా యమ్మ ఈత పొరకలు కడ్తది మా నాయన సాపలు బుట్లు అల్లుతది' అన్నెది. ఇట్టమాట్లాడతానే నేను గాలాలు సుట్టుకుంటి. ఆయమ్మి శాపలు ఎక్కిచ్చిన తుంగను అట్టనే శేతిలోకి తీసుకోని నీళ్ళల్లో పెట్టి తడిపి తీసుకుని వచ్చి నా శేతికి ఇచ్చి నన్ను మెచ్చుకున్నెట్టు 'బోపట్టినవే' అన్నెది.

'ఏమనుకున్నెవు నేనంటే' అన్నెట్టు ఆయమ్మి తిట్టు జూసి నగితి.

ఆయమ్మిగూడా నన్ను జూసి నవ్వి నువ్వు పనోనివేలే అన్నెట్టు జూసింది.

'ఆ శాపలు ఏమిజేచ్చరు' అనడిగింది.


'అంటే' అన్నెట్టు ఆయమ్మి తిట్టు జూచ్చి.

ఆయమ్మి నన్ను అర్థం చేసుకుని 'కూర జేచ్చరా ఏంచుకోని తింటారా అని' అన్నెది.

'కూర జేసుకుంటాము' అని అంటి.

ఇంతలో 'ఓమ్మేయ్ సుబ్బలచ్చిమీ అమ్మ పిలుచ్చాంది రామ్యా' అని నిన్న దెబ్బలు తిన్నవాళ్ళ తమ్ముడు పిలుచ్చానే 'మా యమ్మ పిలుచ్చాంది పాయొచ్చ' అని ఉరికింది.

ఓబ్బో ఆయమ్మికి శానా తెలివుండాది అనుకుని ఇంటిదావబడ్తి. శాపలు గాలాలు తీసుకోని పోతాంటే సత్రం కాడ ఉన్నె ఆయమ్మి నాయనో శిన్నాయనో తెలియదు గాని బాగానే పన్నాయి గదబ్బా శాపలు అనె. అవును అన్నెట్టు పులిని సంపిన యాటగాని మాదిరి నవ్వుకుంటూ ఇంతికి పోతి.



రెండు రోజులయినంక గాలాలు పట్టుకోని మళ్ళా ఏటికిపోతి అంతకు ముందు రోజంతగా తగల్లేదు గాని అప్పుడొకటి అప్పుడొకటి పడ్తాండయి. ఇట్ట ఒకటి రెండు శాపలు పన్నెంక ఆయమ్మి వచ్చింది. వచ్చానే ఓ తుంగదీసి దాన్ని నమిలి శాపలు ఎక్కిచ్చింది.

'ఈ రోజు సరిగా పన్నెట్టు లేవే' అన్నెది. 'పడ్తయి' అనంటి. నేను శాపలు పడ్తాంటే ఆయమ్మి గాలాలు బయటకు లాగేప్పుడు అడ్డం లేకుండా సందు జూసుకోని గూకున్నెది.

ఆ మాట ఈ మాటా మాట్లాడ్తాన్నెం. ఆయమ్మి మాటలు ఇంటావుంటే శానా తెలివయింది అనిపిచ్చింది. పెద్దమనిషి మాట్లాడినట్లు మాట్లాడతాంది. శానా పెద్దమనిషి లాగా ఆయమ్మి మాటలుండాయి. పెద్దోళ్ళు మాట్లాడినట్లు మాట్లాడ్తది ఆయమ్మి.

'ఈ ఊర్లో ఎన్ని రోజులు ఉంటారు' అనడిగితి.

'మా ఈతాకులు అన్నీ అయిపోయేదాంక ఉండి మా సాపలు, పొరక్కట్టలు అయిపోయినంక పోతం' అన్నెది.

'ఎప్పుడు అయిపోతయి?' అంటి.

'మా నాయన వాళ్ళు నేచ్చాండరు. అయన్నీ ఊర్లో వాళ్ళు కొన్నెంక అయిపోతయి' అన్నెది.

ఆ మాటా ఈ మాటా మాట్లాడుకుంటిమి. మాట్లాడే కొద్దీ ఆయమ్మి సావాసం నాకు దగ్గరైతాన్నెట్టు అనిపిచ్చింది. ఆ యమ్మి గూడా నాతో శానా బాగా మాట్లాడతాంది.

మా సావాసం ముదిరింది. సగిలేటి కంపశెట్లల్లో నీళ్ళలో మా ఆటలు పాటలు. తెల్లారితే వాళ్ళమ్మ నాయనలు పనికిపోతే నేను గాలాలు తీసుకోని ఏటికి రావడం ఆయమ్మితో కలిసి ఈత కొట్టడం. గుబ్బురు కంప శెట్లల్లో లోపలికి చిన్నదావ జేసుకోని లోపల శెట్ల మద్దెన ఉన్నె ఇశికలో ఉండే కంపంతా ఏరి ఊడ్సి దాన్ని సదునుజేసి కంపశెట్లతో ఇల్లులాంటిది తయారు జేచ్చిమి. ఆడికి పోవాలంటే దావ మాకు మాత్రమే కనపడేట్టు అడ్డం కంప ఏసినాము. ఆడికి సామాన్యంగా ఎవురూ రారు. ఆడికి రావాల్సిన అవుసరం ఎవురికి లేదు. ఆడికి పోవాలంటే నీళ్ళల్లో ఈదుకుంటూ పొయి ఒడ్డుకు చేరి రవ్వంత దూరం కంపశెట్లల్లో నడ్సుకుంటూ పోవాల. నాకు ఆయమ్మికి మాత్రమే అది తెలుసు. అన్నె ఆయమ్మి నేను అమ్మా నాయన ఆటలు ఆడుకుంటాంటిమి. సామయ్యగానికి గూడా మా సావరం తెల్సు. అప్పుడప్పుడూ సామయ్య గాడు ఏటికి వచ్చి మాతో పాటు ఆడుకునే వాడు. మా సావాసం చూసి అడుక్కుండే వాళ్ళతో సావాసం ఏందిరా అనేటోడు. వాడట్టన్నెప్పుడు ఒక్కరవ్వ అవుగదా అనిపిచ్చినా ఆయమ్మి కనపచ్చే ఏమి మతికి వచ్చేదికాదు.

రోజూ పొద్దుగూకినంక ఆయమ్మి వాళ్ళ తమ్ముడు శెట్టిగారి ఈదిలో అడుక్కోడానికి పోతరు. ఆడ అడుక్కుని వాళ్ళుంటాన్నె సత్రానికి పొయ్యే దావలో మా

## ఊరుతో సంచారజాతుల అనుబంధం



పల్లెలో పుట్టి పెరిగిన నేను నాకు తెలిసిన విషయాలను కథలుగా రాస్తుంటాను. నా బాల్యంలో మా ఊరికి వచ్చే సంచార జాతుల వారిని చూశాను. సంచారజాతుల వారికి ఒక ఊరితో అనుబంధం ఏర్పడితే.. ఎలా ఉంటుంది అనే ఆలోచనల నుంచి కథను మలచాను.

-బత్తుల ప్రసాద్
9000534528

ఇండ్లు ఉంది. మా ఇంటికాడ ఆయమ్మి అడుక్కుండేది కాదు. ఆయమ్మి ఎందుకు మా ఇంటికాడ అడుక్కోదో అర్థం కాలేదు. అది ఆయమ్మి సావాసగారి ఇండ్లని అడుక్కోలేదా? లేకుంటే నన్ను మొగుడు అనుకోని అత్తగారిండ్లు అనుకోని అడుక్కోడం లేదా తెలియక పాయ. కొందరు సాదయ్యులు శెట్టిగారి ఈదిలో అడుక్కుని ఆ ఈదికి ఆనుకోనున్న మా ఇంటికి వచ్చి 'మాతా బిక్షాం దేహి' అంటారు. మా యమ్మ బిచ్చం తెచ్చేలోపల మా ఇంటి వాకిలికి పైన తగిలిచ్చ ఉన్నె ఏసుప్రభువు పటం తట్టు జూసి తప్పుజేసిన వాళ్ళమాదిరి. 'హర హర మహాదేవ శంభో' అని నడ్సుకుంటూ ఎళ్ళిపోయేటోళ్ళు. వాళ్ళట్ట ఎందుకు పోతాండారో అర్థంగాకా పోయేది. ఒకరోజు మా యమ్మను అడిగితే మనం క్రిస్టియన్లమని మన ఇండ్లలోది వాళ్ళు తినరు అన్నెది. ఆ మాట అంటానే అడుక్కుండే వాళ్ళకు గూడా అంటు ఉందే అనుకుంటి. మనసు కలుక్కుమన్నెది. దాన్ని గురించి మర్సిపోతి. శానామంది సాధువులు అట్టనే జేచ్చాండిరి. సావాసాగాడు లేకుంటే మొగుడు అని అనుకుంటే పరవాలేదు గాని మాది తక్కువ కులమని అడుక్కోకుండా ఉందేమో అని ఆలోశన వస్తే ఒక్కరవ్వ బాధ. ఆయమ్మిని అడుగుదామనుకుంటి ఎందుకు మా ఇంటికాడ అడుక్కోవు అని. ఆయమ్మి లేనప్పుడు ఏమేమో అనుకుంటి గాని ఆయమ్మి దగ్గెరకు వచ్చే ఇయన్నీ మర్సిపోతాంటి.

ఒకరోజు ఆయమ్మి నేను మా స్థావరంలో ఉంటే ఆయమ్మి నా ఎదాన తలకాయ పెట్టుకోని పండుకోనీ అదీ ఇదీ మాట్లాడి 'నాకు శేతులనిండా గాజులు ఏసుకోవాలనుంది అన్నెది' ఆలోశించకుండా 'నేను తీసకచ్చలే' అంటి. 'మీ అక్క శెళ్ళెళ్ళయి ఇంట్లోనుండి తేడంగాదు. కొత్త గాజులు కావాల' అనింది. ఓ అదెంత తెచ్చిచ్చా అని చెప్తి.

గాజులు కావాలంటే లెక్కగావాల. లెక్క సుతారుగానే అయితది. ఆయమ్మికి శెప్పినా గాని ఆలోశన్లో పడితి. లెక్క ఎట్టవచ్చది. ఏమీ జేచ్చే లెక్కొచ్చది అని. సరే పుస్తకాలు కావాల లెక్క ఇయ్యమని మా యమ్మను అడిగితే సెలవుల్లో ఏమి పుస్తకాలురా అంటది. ఇంట్లో లెక్క దొంగతనం చేజ్జామంటే లెక్క బీరువా మా బొడ్లో ఉండే మాయమ్మ సిత్తి. మా యమ్మ బొడ్లో నుండి లెక్క తియ్యడం ఆ దేవునికి గూడా తరంగాదు. మా యమ్మ ఎవురికన్నా లెక్క ఇయ్యాలంటే సిత్తిలో రెండు ఏళ్ళు పెట్టి ఏ నోటు తీయాల్నో ఆ నోటు, ఎంతకావాల్నో అంతే తీచ్చది. మా యమ్మకాడ లయలు పడి అంతో ఇంతో ఇప్పిచ్చుకుంటి. సోమయ్య గాని వాళ్ళ నాయన పీటరయ్య నాటు సారాయి కాసే వాళ్ళకు తెల్లదుమ్మ నార తీయడానికి పోతాంటే వాళ్ళెంటంబడి నేను గూడా పోతి. వాళ్ళు మనిసికి ఐదు కట్టలు నార తీచ్చే మూడు కట్టలు తీచ్చి. ఆ నార అమ్మితే ఇంత లెక్క వచ్చింది.

లెక్కశేతిలో పడింది. ఇంగ గాజులు తీసుకోని రావాల. తీసకజ్జామంటే మా ఊర్లో ఒక్కటే గాజులంగడి ఉంది. ఆ గాజులంగడాయిన ఊర్లో అందరికీ బాగా తెలుసు. ఆయనకు కూడా ఊర్లో ఆడపిళ్ళోల్లు ఎంతమంది ఉండారు. ఎవరిశేతికి ఏ సైజు గాజు పడుతుంది అనేది తెలుసు. ఆ మనిసి అంగడిపెట్టక ముందు మా ఊరికి గాజులు వేయడానికి పక్కూర్ల నుండి మొగోళ్ళు గాజులు గుత్తులు గుత్తులు ఓ తాడుకు తగిలిచ్చుకుని వచ్చేవాల్లు. రెండు మూడు ఇండ్ల ఆడోళ్ళంతా ఆయన సుట్టూ కూచ్చోని ఉంటే ఎవురికి ఏ రంగు గాజులు గావాల్నో వేసి పోయేవాడు. కొందరు శేతులకు గాజులు సులువుగా ఎక్కితే ఇంకొందరికి శానా గట్టిగా ఉంటే శేతిని పట్టుకోని మొత్తంగా నలిపి గాజు పగలకుండా ఎక్కిచ్చేవాడు. ఆ గాజులు ఓటియో గట్టియో తెల్సుకోవడానికి గాజును బొటికన వేలు మద్దెన వేలుతో పట్టుకుని గాజును తిప్పేవాడు. ఓటి గాజులు అయితే టపుక్కున పగిలిపోయేవి. గాజులాయన గాజును అట్ట పరిచ్చ శేచ్చాన్నెప్పుడు నేను అట్టనే సూచ్చాంటి.

మా ఊర్లో ఉండే గాజులంగడాయన కాడికి పొయి గాజులు కొంటే ఈ మనిషి 'ఎవురికి' అని అడుగుతాడు. మా యక్కకో శెల్లిలికో అని శెపితే వాళ్ళు ఆ దావన పొయ్యేతప్పుడు మీ తమ్ముడు గాజులు తెచ్చినాడు సరిపోయినయా అని అడుగుతాడు. అప్పుడు నా గాజుల యాపారంతో పాటు కేసు మొత్తం బయటికి వచ్చది. నాకు మెట్టు దెబ్బలు కాయం అని జెప్పి ఆయమ్మి కాడ ఆల్తికి గాజు తీసుకుని పోరుమాళ్ళకు పోతి. పోరుమాళ్ళలో సినిమా జూసి గాజులు కొనుక్కోని కరెప్పొకు బస్కెక్కితి. అది శీకటి పన్నెంక ఊర్లోకి వచ్చది. అది దిగి ఇంటికి పొయ్యారక అందరూ నిద్దర పోతాంటారు.

ఇంటికివచ్చి గాజులను ఒక సొక్కాలో సుట్టి నా పెట్టి అడుగున పెట్టి అన్నందిని పండుకుంటి. రాత్రంతా నిద్దర పట్టకపాయ. ఆ గాజులు జూసి ఆయమ్మి ఎంత సంబరపడ్తతో, గాజు లేసుకుని ఎంత సిగ్గుపడ్తదో అనుకుంటూ పండుకుంటి. రాత్రంతా కోడీనిద్రే ఎప్పుడు తెల్లార్తదా అనిపిచ్చాంది.

ఎట్టనో కొట్ట శానాబరువుగా శెరుకు బండి అరక ఎక్కనిట్లు మెల్లగ తెల్లారింది. గబగబా మేము కలుసుకుండే స్థావరం కాడికి ఎల్లబారితి. రోజూ నేనూ వాళ్ళుండే సత్రం ముందరనుండే ఏట్లోకి పోవాల. నేను పొయ్యేది జూసి నేను పొయ్యేదావ గాకుండా ఇంగో దావలో కంపశెట్లలో నుండి వచ్చది. గాజులు తుండుగడ్డలో సుట్టుకుని ఎర్రలు పెట్టుకునే సిత్తిలో పెట్టుకోని గాలాలు బుజాన పెట్టుకుని బయలుదేర్తి.

సత్రం కాడికి వచ్చి సత్రం తిట్టు జూచ్చి ఆడ ఒక పిల్ల లేదు. నిన్నటి దాంకా మనుసులు ఉన్నెట్టు జాడగూడా లేదు. శుబ్బరంగా ఊడ్సినారు. ఆయమ్మి వాళ్ళు ఆన్నుండి బస ఎత్తేసి వేరే ఊరికి ఎళ్ళబారి పొయినారు. నాకు ఏమీ అర్థం గాలేదు. గాలాలు, ఎర్రలు ఆ సత్రం మీదికి ఇసిరేసి గాజులు తుండుగడ్డ బట్టుకోని గిద్దలూరు దావబడ్తి ఆ పక్కన ఉన్నె ఊర్లన్నీ ఎతికితి. ఏడా జాడ గూడా కనపడకపాయ. నా బాధను తట్టుకోడానికి ఇష్టమొచ్చినట్టు నడిచ్చి, గుండెకాయకు గచ్చకాయ కంప తగులుకున్నెట్టు బాధ సుడి తిప్పుతాంది. కోపం, ఏడుపు రెండూ వచ్చాండయి. అంతా తిరిగి కాళ్ళీడ్సుకుంటూ సగిలేట్లో మేము కల్సుకుండే స్థావరం కాడికి వచ్చి, బాధ ఇంగా ఎక్కువయింది. తుండు గుడ్డలో ఉండే గాజులు కాగితంలో నుండి ఇప్పదీచ్చి. ఏట్లో రెండు తుంగలు ఒక దాని పక్కన ఒకటి నిలబడి ఊగుతాండయి. ఆ తుంగ ఆయమ్మి శేతులమాదిరి కనపడింది. ఆ గాజులు తీసి రెండు తుంగలకు తొడిగితి. జేబులో శెయ్యిపెట్టి ఆల్తి గాజు తీచ్చా ఉంటే అది తునిగి పోయింది. ఆ తునకలను తీసి ఏట్లో ఏచ్చి, అయితే ఆ గాజు తునకల్లో ఓ శిన్న తునక నా జేబిలో ఉన్నెదేమో ఆయమ్మి మతికి వచ్చినప్పుడల్లా నా గుండెల్లో గుచ్చుకుంటా ఉంటది.

*



## తాగుబోతును కాను...

"నేనేమీ తాగుబోతును కాను. మనసు బాగా లేనప్పుడు ఫ్రూట్‌జ్యూస్‌లో కొద్దిగా మందు కలిపి తాగుతానే తప్పించి కొంతమంది తారల్లా నడిరోడ్డు మీద మందు కొట్టను'' అని శ్రియ అంటున్న మాటలు వింటూంటే ఎవరికైనా నవ్వు రాక మానదు. మొన్నటికి మొన్న మరో హీరోయిన్‌తో కలిసి మందు కొడుతూ మీడియాకు దొరికిపోయిన సంగతి శ్రియ మరిచిపోయినా ఆ ఫొటోలు చూసిన వారు మరిచిపోలేదు. శ్రియ చెప్పినట్టు రోడ్డు మీద తాగకపోయినా, ఇటీవల క్రమం తప్పకుండా పబ్‌లకి మాత్రం వెడుతోందట! అర్థరాత్రి వరకూ అక్కడ గడిపి వస్తోందట! అప్పుడప్పుడు పబ్‌లోని వారితో గొడవలు షరా మామూలే! వీటన్నింటికి కారణం మనసు బాగాలేకపోవడం కాదనీ, అవకాశాలు లేక అన్న సంగతి జగమెరిగిన సత్యం. పాపం శ్రియానే ఈ విషయాన్ని గుర్తించడం లేదు!